ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 15 ఏప్రిల్ 2025





అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళి అర్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు శంకర్, రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

బహుజనులు స్వేచ్ఛగా బతకాలి

- అంబేడ్కర్ ఆశయ సాధనే టీడీపీ లక్ష్యం
- ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత వైసీపీది
- రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేద్దాం
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఘనంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

అరసవల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'స్వేచ్ఛ, ధైర్యంతో బహుజనులు బతకాలి. అంబేడ్కర్ ఆశయాల సాధనకు అదే మార్గమ'ని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జంక్షన్‌లో తొమ్మిదిన్నర అడుగుల అంబేడ్కర్ కాంస్యవిగ్రహాన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. గజమాల, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. 'అంబేడ్కర్ జీవితాశయాలను అనుసరించి ప్రజలు నిజమైన నివాళులర్పించాలి. అంబేడ్కర్ ఒక మతానికో, కులానికో చెందిన వ్యక్తి కాదు. ఆయన ఒక సంఘ సంస్కర్త. రాజ్యాంగ కర్త. ఆయన రచించిన రాజ్యాంగం ఒక భగవద్గీత, బైబిలు, ఖురాను వలే ఎంతో పవిత్రంగా విలసిల్లుతోంది. సమాజంలో అసమానతలు తొలగించేలా.. విద్య మాత్రమే జీవితాలను మార్చగలదని నమ్మి, ఉన్నత చదువులు అభ్యసించి, దేశ రాజ్యాంగాన్ని రచించి, నేటికీ పూజలందుకునే గొప్పస్థాయికి ఎదిగిన మహానుభావుడు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా టీడీపీ పనిచేస్తోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది. గత వైసీపీ పాలనలో ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన దౌర్భాగ్యపు పరిస్థితి సృష్టించారు. నేడు కూటమి ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా వేలాది మందికి స్వ యం ఉపాధి కల్పనకు వేలకోట్ల రుణాలను మంజూరు చేస్తున్నాం. అందరం రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేద్దాం. అంబేడ్కర్ ఆశయాలను గౌరవిద్దాం. ఆయన బాటలో పయనిద్దాం' అని (మిగతా 8వ పేజీలో..)

అణగారిన వర్గాలకు న్యాయం

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

అణగారిన వర్గాలకు పూర్తిస్థాయి న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని, తద్వారా అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 'ఈ ఏడాది అంబే డ్కర్ జయంతి ఉత్సవాలు ఎప్పటికీ ప్రత్యేకం. తొమ్మిదిన్నర అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని.. ఆ మహానుభావుడి జయంతి రోజునే ఏర్పాటు చేయడం ఎన్నటికీ మరచి పోలేని అనుభూతి. మా ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి ఎప్పటికీ కట్టుబడి ఉంటుంది. జస్టిస్ పున్నయ్య కమిషన్ ప్రతిపాదించిన 29 సూత్రాలను ఒకేసారి అమలు చేసిన ఘనత టీడీపీదే. పీ-4 విధానంతో వ్యక్తిగత, సమాజ వికాసం సాధ్యమవుతుంద'ని మంత్రి అచ్చెన్న తెలిపారు. అనంతరం విగ్రహ శిల్పి రాజ్‌కుమార్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు సత్కరించారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, పోలీసుల అదుపులో నిందితులు

పాస్టర్‌ను తరిమేయాలని..

- మరో పాస్టర్ దుష్ట పన్నాగం
- హిందూ దేవాలయాల గోడలపై అన్యమత ప్రకటనలు
- ప్రజల దృష్టి మళ్లించి.. మత విద్వేషాలు సృష్టించి..
- చర్చి నిర్మాణాన్ని అడ్డుకునేందుకు యత్నం
- ముగ్గురు అరెస్టు: ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): 'వృత్తిలో ఉన్నవారితోనే శత్రుత్వం' అన్న చందంగా ఓ పాస్టర్ వ్యవహరించాడు. మరో పాస్టర్‌ను ఊరి నుంచి తరిమేసి.. ఆ గ్రామంలో చర్చి నిర్మాణం ఆపేయాలని దుష్టపన్నాగం పన్నాడు. ఈ క్రమంలో గత నెల 29, 30 తేదీల్లో జలుమూరు మండలం యలమంచిలితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో హిందూ దేవాలయాల ప్రహరీలపై అన్యమత ప్రచారం చేశాడు. ఆ తప్పును మరో పాస్టర్‌పై నెట్టేందుకు పథకం రచించాడు. ఇంతవరకు మత ఘర్షణలులేని జిల్లాలో ఈ విషయమై చిచ్చురేగింది. హిందూ సంస్థలు.. ఇతరత్రా ప్రజలు.. ఆందోళనకు దిగారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్పీ మహేశ్వరరెడ్డి ప్రత్యేక బృందాలను నియమించి ఈ కేసును ఛేదించారు. ఈ పన్నాగంలో పాస్టర్‌తోపాటు ఆయనకు సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిందితులను ప్రవేశపెట్టి కేసు పూర్వాపరాలను ఎస్పీ వివరించారు.

ఏమి జరిగిందంటే..

జలుమూరు మండలం యలమంచిలిలో చొక్కాపు శంకరరావు గత రెండేళ్లుగా పాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల యలమంచిలిలో చర్చిని నిర్మించేందుకు 30 సెంట్ల భూమిని స్వామి అనే వ్యక్తి సేకరించారు. ఆ స్థలంలో చర్చి నిర్మిస్తే.. పాస్టర్‌గా శంకరరావే కొనసాగుతారు. యలమంచిలికి ఆనుకుని ఉన్న బుడితి(సారవకోట మండలం)లో చర్చి ఉంది. ఈ చర్చికి కొంతమంది క్రైస్తవులు మాత్రమే వెళ్తుంటారు. అధికమంది యలమంచిలిలోని చర్చిలో ప్రార్థనలకు హాజరవుతుంటారు. యలమంచిలిలో చర్చి నిర్మాణం పూర్తయితే బుడితి చర్చికి వచ్చేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోతుందని.. కానుకలు కూడా లభించవని బుడితి చర్చి పాస్టర్ చందక దేముడు నాయుడు అలియాస్ జాన్ పీటర్(39) అసూయ చెందాడు. ఎలా అయినా సరే చర్చి నిర్మాణం జరగకుండా యలమంచిలిలో ఉన్న పాస్టర్ శంకరరావును తరిమేస్తే.. క్రైస్తవులు తాను ఉన్న చర్చికే వస్తారని దుష్టపన్నాగం పన్నాడు. ప్రజల్లో శంకరరావుపై కోపం తెప్పిస్తే.. తన లక్ష్యం నెరవేరుతుందని భావించాడు. ఈ విషయమై తన సన్నిహితుడు పాగోటి ఈశ్వరరావుతో సంప్రదించాడు. ఈశ్వరరావు తన చిన్ననాటి మిత్రుడైన కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన మామిడి అజయ్(33)ను తీసుకువచ్చి పరిచయం చేశాడు. ఈ ముగ్గురూ కలిసి.. హిందూ దేవాలయాలపై అన్యమత ప్రచార (మిగతా 6వ పేజీలో..)



- మెళియాపుట్టి మండలం రామచంద్రాపురం సమీపంలో సచివాలయం, రైతుసేవా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాల కోసం వేసిన పిల్లర్లు ఇవి. వెంకటాపురం, కొత్తూరు గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినట్లు గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. కానీ, పనులు మాత్రం పిల్లర్ల స్థాయికే పరిమితయ్యాయి. వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడి స్వగ్రామంలోనే పనులు ఇలా ఉంటే మిగతా చోట్ల ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

అంతన్నారు.. ఇంతన్నారు..

- పూర్తికాని సచివాలయ భవన నిర్మాణాలు
- రైతు సేవా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లదీ ఇదే పరిస్థితి
- డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కేంద్రాలు కూడా..
- బిల్లుల చెల్లింపులో గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపైనే భారం



- మెళియాపుట్టి మండలం వసుంధరలోని రైతు సేవా కేంద్రం పరిస్థితి ఇది. ఈ సచివాలయం పరిధిలో రట్టిణి, వసుంధర, నడసందర పంచాయతీలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వసుంధర వద్ద సచివాలయంతో పాటు రైతుసేవా కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, హెల్త్‌క్లినిక్, బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేశారు. అయితే ఒక్క రైతు సేవా కేంద్రం భవనం మాత్రమే నిర్మించారు. అది కూడా సగం పనులే చేశారు. మిగతా భవనాల పనులు పునాదులకే పరిమితమయ్యాయి.

మెళియాపుట్టి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రజల ముంగిటకే పాలన అంటూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామాల్లో సచివాలయ భవనాలతో పాటు అన్నదాతల కోసం రైతుభరోసా కేంద్రాలు (ఇప్పుడు రైతు సేవా కేంద్రాలుగా మారాయి), ప్రజలకు వైద్యం అందించేందుకు వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లు, నిరుద్యోగుల కోసం డిజిటల్ లైబ్రరీలు, పాడి రైతుల కోసం బల్క్‌మిల్క్ కేంద్రాలు నిర్మిస్తామని గొప్పలు చెప్పింది. వీటి కోసం స్థలాలు కేటాయించి పనులు ప్రారంభించింది. అయితే, ఐదేళ్ల పాలనలో కొన్ని భవన నిర్మాణాలే పూర్తయ్యాయి. మిగతా భవనాలు పునాదుల స్థాయిని దాటలేదు. మొదట్లో కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు మంజూరు చేయడంతో చాలాచోట్ల నిర్మాణాలు పూర్తయి భవనాలు అందుబాటులోకి వచ్చాయి. తరువాత రానురానూ బిల్లుల చెల్లింపులో జగన్ సర్కారు నిర్లక్ష్యం చేయడంతో మిగతాచోట్ల పనులన్నీ అర్ధాంతరంగా ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లూ కేంద్రం నుంచి వచ్చిన ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులను సచివాలయాలు, రైతుసేవా, బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణాలకు మాత్రమే వినియోగించింది. కానీ, పనులు మాత్రం పూర్తి చేయలేదు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో 833 సచివాలయ భవనాల పనులు ప్రారంభించారు. ఒక్కో భవనానికి రూ.40 లక్షల చొప్పున రూ.309.63 కోట్ల అంచనాతో నిధులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 488 భవనాలు పూర్తి కాగా, 345 భవనాలు వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. వీటికి రూ.144.83 కోట్లు ఖర్చు చేసినట్లు గత ప్రభుత్వం లెక్కలు చూపించింది.

- రైతుభరోసా కేంద్రాలకు సంబంధించి ఒక్కోదానికి రూ.20.80 లక్షలు మంజూరు చేశారు. జిల్లాలో 656 ఆర్‌బీకేలకుగాను 238 నిర్మాణాలు జరిగాయి. 40 కేంద్రాల పనులు పూర్తయినా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రార్లు ఆ భవనాలను అప్పగించలేదు. 378 ఆర్‌బీకేల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- హెల్త్‌క్లినిక్‌లకు సంబంధించి ఒక్కో భవన నిర్మాణానికి రూ.17.50 లక్షలు మంజూరు చేశారు. జిల్లాలో 663 పనులకు గాను రూ.180.50 కోట్ల అంచనాలతో (మిగతా 8వ పేజీలో..)

పూర్తయిన భవనాలను గుర్తిస్తున్నాం..

గత ప్రభుత్వంలో నిర్మాణాలు పూర్తయిన సచివాలయ, రైతుసేవా కేంద్రాల భవనాలను గుర్తిస్తున్నాం. ఈ నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం. కొంతమంది కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాలను అప్పగించడం లేదు. వారితో చర్చించి భవనాలు అప్పగించాలని కోరుతాం.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి



పనులు పూర్తి కాకముందే ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు

ఆఫ్‌జోర్

- ఊపందుకున్న రిజర్వాయర్ పనులు
- రెండేళ్లలో పూర్తిచేసేందుకు ప్రణాళికలు
- ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యటనతో రైతుల్లో ఆశలు

పలాస, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు జోరుగా సాగుతున్నాయి. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా 2008లో రూ.127కోట్ల వ్యయంతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పలాస మండలం రేగులపాడు గ్రామం వద్ద శంకుస్థాపన చేశారు. అప్పట్లో నిర్వాసితులు, భూములు కోల్పోయిన వారికి ఎటువంటి ప్యాకేజీ ప్రకటించలేదు. దీంతో శంకుస్థాపన వరకే ప్రాజెక్టు పరిమితమైంది. తర్వాత ప్రభుత్వాలు మారినా.. ఏళ్ల తరబడి 'ఆఫ్‌షోర్' పనులకు మోక్షం కలగలేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం.. ఆఫ్‌షోర్ నిర్మాణంపై దృష్టి సారించింది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే శిరీష ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెండు బడ్జెట్‌ల్లో రూ.30కోట్లు, రూ.90కోట్లు ప్రకటించి పనులు చేయాలని జలవనరులశాఖకు ఆదేశించింది. 20 రోజులుగా పాత బకాయలు తీర్చడంతోపాటు కొత్తగా నిధులు వెచ్చించడంతో పనులు ఊపందుకున్నాయి. రెండు కిలోమీటర్ల పొడవునా గట్టు, సరప్లస్‌వీయర్(పరుపు), స్లూయస్, ప్రధాన కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే గట్టు పనులు జరుగుతున్నాయి. మట్టి తవ్వకాలపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వంశధార ఎస్ఈ పీవీ తిరుపతిరావు, పలాస, పాతపట్నం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, మామిడి గోవిందరావుతో కలిసి శనివారం రేగులపాడులో పర్యటించారు. రైతులు, నిర్వాసితులు, అధికారులతో సమీక్షించారు. నష్టపరిహారం చెల్లించకుండా మట్టిని తవ్వుతుండడంతో ప్రజల్లో నెలకొన్న అశాంతిని తొలగించేలా కలెక్టర్ తగు ఆదేశాలు జారీచేశారు. 2019 పునరావాస ప్యాకేజీతోపాటు నష్టపరిహారం 20 రోజుల్లో చెల్లించేలా ఒప్పందం కుదిర్చారు. కేవలం 70 రోజుల వ్యవధిలో ఏడు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు జరగాలని కాంట్రాక్టర్లకు మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు గట్టు ఎత్తుచేసే ప్రక్రియ శరవేగంతో జరుగుతోంది. మొత్తం రెండు కిలోమీటర్ల పొడవునా మీటరు ఎత్తులో మట్టిని వేసి చదును చేశారు. రిజర్వాయర్ కింది లెవెల్ నుంచి ఐదు మీటర్ల ఎత్తు వరకూ గట్టు నిర్మించారు. మట్టి పనులు శరవేగంతో జరుగు తున్న నేపథ్యంలో నీటిని ఒడిసి పట్టేందుకు అవకాశం ఉంది.



ఆఫ్‌షోర్ రిజర్వాయర్ మట్టి పనుల కోసం సిద్ధమైన టిప్పర్లు..

సరప్లస్‌వీయర్ ప్రాంతంలో సిమెంట్ పనులను రిజర్వాయర్ చివరిదశలో చేపట్టనున్నారు. అలాగే కాలువలు, పలాస-పర్లాకిమిడి ప్రధాన రహదారి పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ చేసినా నష్టపరిహారం వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో ఆ పనుల్లో పురోగతి లేదు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆ పనులు ఈ ఏడాది చివరినాటికి ప్రారంభించే అవకాశం ఉంది.

ఖరీఫ్ నాటికి నీరు..

పనులు 20 శాతం జరగకముందే ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌లో నీరు నిల్వ ఉంటోంది. గట్టుపనులు శరవేగంతో పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి ఒక ఎమ్మెల్డీ నీరు నిల్వ చేసి కుడి కాలువ ద్వారా కనీసం నందిగాం మండలం రైతులకు (మిగతా 8వ పేజీలో..)

డైట్ లెక్చరర్ పోస్టులకు రాత పరీక్ష

గుజరాతీపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గార మండలం వమరవల్లిలోని డైట్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 5 సీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ల పోస్టులకు ఈ నెల 16, 17వ తేదీల్లో రాత పరీక్ష నిర్వహించనున్నట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'డైట్‌లో ఖాళీ పోస్టులకు సంబంధించి ఎఫ్ఎస్‌టీ ఎస్ ప్రాదిపదికన డిప్యూటేషన్‌పై దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థుల జాబితాను డీఈవో, శ్రీకాకుళం వైబ్‌సైట్‌లో పొందపర్చాం. వారికి ఇచ్చిన శ్లాట్ తేదీల్లో శ్రీకాకుళంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో రాత పరీక్ష ఉంటుంద'ని డీఈవో వెల్లడించారు.



8లో

చేపల వేటకు విరామం

- నేటి నుంచి జూన్ 14 వరకు అమలు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

సాంకేతికతతో సమగ్ర అభివృద్ధి

8లో

- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు
- చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి
- జిల్లాలో వినూత్న ప్రయోగానికి శ్రీకారం

రైతులకు అందని వడ్డీ రాయితీ

7లో

- మూడేళ్లుగా ఖాతాలకు జమకాని సొమ్ము

వ్యక్తి ఆత్మహత్య


చెట్టుకు ఉరి వేసుకున్న వాసుదేవరావు

కోటబొమ్మాళి ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి స్టేట్ బ్యాంకు వెనుక, ప్రకాష్ నగర్ కాలనీ సమీపంలో సోమవారం మధ్యాహ్నం చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన కోరాడ వాసుదేవరావు (58) ప్రకాష్ నగర్‌లో నివాసం ఉంటూ ఓ హోటల్‌లో వంట పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా హోటల్‌కు వెళ్లలేదని, ఎందుకు ఆత్మ హత్య చేసుకున్నారో తెలియదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతు డికి ఇద్దరు కుమారులున్నారు. మృతి విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్య నారాయణ సిబ్బందితో కలిసి ఘటన ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాంధీనగర్‌లో మరో వ్యక్తి..


ధర్మారావు (ఫైల్)

సోంపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ వీధికి చెందిన గేదల ధర్మారావు(42) ఆదివారం రాత్రి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మారావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇతడికి భార్య మోహినితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన ధర్మారావు రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. సోమవారం ఉదయం గొల్లవాని చెరువు వెనుక జీడితోటలో వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మోహిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లవరాజు తెలిపారు. మృతదేహాన్ని కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

పాస్టర్‌ను తరిమేయాలని..

(ఐదో పేజీ తరువాయి)



చర్చి నుంచి మార్చి 29న రాత్రి బయటకు వస్తున్న నిందితులు (సీసీ ఫుటేజీ)

ప్రకటనలు రాసి.. ఆ నేరాన్ని తెలివిగా శంకరరావుపై నెట్టేలా చేద్దామని ప్రణాళిక వేసుకున్నారు. మార్చి 29న రాత్రి ఈ ముగ్గురూ సమావేశమై.. యలమంచిలిలోని ఎండల కామేశ్వరస్వామి ఆలయం లోపల ప్రహరీపై 'ఏసుక్రీస్తు బోధనలు' రాశారు. తర్వాత సమీపం లో ఉన్న అసిరితల్లి ఆలయ గోడలపై శిలువ గుర్తు వేశారు. ఆ తర్వాత కామినాయుడిపేట ఆంజనేయ స్వామి ఆలయం గోడపై, కొండపోలవలస ఆంజేయస్వామి ఆలయం గోడలపైనా ఏసుప్రభువును కీర్తిస్తూ.. శిలువ గుర్తులు వేశారు. జాగ్రత్తగా ఎవరూ గమనించకుండా పరారయ్యారు. స్థానికంగా ఉండే పాస్టర్ శంకర రావుపైనే ప్రజలకు అనుమానం వచ్చేలా ఇదంతా చేశారు. ప్రజలు మార్చి 30న సాయంత్రం ఆలయాలపై ఈ రాతలు చూసి.. హిందూ సంస్థలు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మత ఘర్షణలు చెలరేగకుండా ఎస్పీ ఆధ్వర్యంలో కఠినచర్యలు ప్రారంభమయ్యాయి. ఆదేశించిన ఏఎస్పీ శ్రీనివాస రావు, నరసన్నపేట, టెక్కలి, కొత్తూరు సీఐలతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. వీళ్లు సాంకేతికంగానూ.. గ్రామాల్లో అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేశారు.

గూగుల్ టైమ్ ఔట్‌ను వాడకపోయినా.. పట్టుబడ్డారు

నిందితులు పాగోటి ఈశ్వరరావు, జాన్ పీటర్, మామిడి అజయ్ తెలివిగా వ్యవహరించారు. పాస్టర్ జాన్ పీటర్‌కు డైరీ రాసుకునే అలవాటు ఉంది. నేరానికి పాల్పడిన రోజున ఇతర విషయాలను మాత్రం డైరీలో పొందుపరిచారు. అందులో అక్షరాలను.. కొన్ని కోట్స్‌ను పోలీసులు పరిశీలించి నేరానికి పాల్పడింది వీళ్లేనని టెక్నికల్‌గానూ గుర్తించారు. మామిడి అజయ్... వృత్తిరీత్యా బైక్ పెయింటర్. చిన్నపాటి పెయింట్ స్ప్రేయర్‌లతో గోడలపై రాతలు రాసే అలవాటు ఉందని పోలీసుల దర్యాప్తులో తేలింది. దేవాలయాల గోడలపై రాసేందుకు వినియోగించిన స్ప్రేయర్‌లు అజయ్ ఇంట్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో వ్యక్తి ఈశ్వరరావు ఎక్కడకు వెళ్లినా సరే గూగుల్ టైమ్ ఔట్‌ను ఆన్ చేసుకుని వెళ్లేవాడు. కానీ ఉద్దేశపూర్వకంగా మార్చి 29, 30 తేదీల్లో దేవాలయాలపై అన్యమత ప్రచార రాతల్లో పాల్గొన్నప్పుడు టైమ్ ఔట్‌ను ఆపేశాడు. టెక్నికల్‌గా డేటా తీసిన పోలీసులకు ఈ విషయం వెల్లడైంది. అలాగే బుడితి చర్చి నుంచి బొలేరో వాహనంలో బయలుదేరడం.. ముగ్గురూ కలుసుకోవడం... యలమంచిలితోపాటు, ఇతర దేవాలయాల వద్దకు వెళ్లడం... తిరిగి ఇళ్లకు వెళ్లిపోవడం.. ఇవన్నీ ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఇవన్నీ పోలీసులు సేకరించి ఎఫ్ఎస్ఎల్‌కు పంపారు. ఇటు టెక్నికల్, అటు విచారణ ఆధారంగా ఆ ముగ్గురినీ సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రతిభ చూపిన ఏఎస్పీ శ్రీనివాసరావు, నరసన్నపేట, టెక్కలి, కొత్తూరు సీఐలు జె.శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, సీహెచ్ ప్రసాద్‌తోపాటు సీసీఎస్ సీఐ చంద్రమౌళిని ఎస్పీ అభినందించారు.

భద్రతా చర్యలుండాలి

మత విద్వేషాలు రేకెత్తించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. 'ప్రార్థనా మందిరాలు నలువైపులా కనిపించేలా సీసీ కెమెరాలు, భద్రతా చర్యలను ఏర్పాటు చేసుకోవాలి. స్థానిక ప్రజలతో యూత్ కమిటీ, పీస్ కమిటీలుగా ఏర్పడాలి. కమిటీ సభ్యులు ఒకరైనా సరే ప్రార్థనామందిరం వద్ద పడుకోవాలి. తగినంత లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలి. మత ఘర్షణలను ప్రేరేపించే అపోహలు, వదంతులను నమ్మి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని ప్రజలకు ఎస్పీ హితవు పలికారు.

తాబేళ్ల రక్షణ కేంద్రం సందర్శన



మెట్టూరు తీరంలో బ్రాహ్మణతర్లా విద్యార్థులు

వజ్రపుకొత్తూరు/పలాస రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మెట్టూరు తీరంలో ఉన్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని పలాస మండలం బ్రాహ్మణతర్లా విద్యా ర్థులు సోమవారం సందర్శించారు. పాఠశాల జాతీయ హరిత క్లబ్, జూని యర్ రెడ్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సముద్ర తీరంలో ఉన్న చెత్తను తొల గించి శుభ్రం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన హేచరీలో పొదిగిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు. సముద్రంలో మత్స్య సంపద పెరుగుదలకు తాబేళ్ల పాత్రపై ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణారావు, ఉపాధ్యాయులు కె.శ్రీనివాస రావు, జి.పద్మ, బి.సుధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం జిల్లాలోని వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్సీ సంక్షేమ సంఘాల నేతలు పాల్గొని నివాళి అర్పించారు. ఎమ్మెల్యేలు అంబేడ్కర్ సేవలను కొనియాడారు.


నరసన్నపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


ఆమదాలవలస: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

నిమ్నజాతుల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి: బగ్గు

నరసన్నపేట/పోలాకి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నిమ్నజాతుల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డా. బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా నరసన్నపేట, పోలాకిల్లో ఆయన విగ్రహానికి పూలమావేసి నివాళి అర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో విశేష భూమిక పోషించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని కీర్తించారు. కార్యక్రమంలో ఎస్టీ, ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఉప్పాడ కేశవరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెవర రాము, జయరాజ్, మోహన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి: శిరీష

పలాస/కాశీబుగ్గ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో యువత నడిచి ఆయన ఆశయసాధనకు పాటుపడాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మొగిలిపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. అలాగే కాశీబుగ్గ బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్ పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర, బర్ల కృష్ణారావు, బుడత జగదీష్ పాల్గొన్నారు.


పలాస: మొగిలిపాడులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి: ఎంజీఆర్

పాతపట్నం/హిరమండలం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం కావాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పాతపట్నం కోర్టు కూడలిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ రచయితగా ఆయనచేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజనసంఘం ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. హిరమండలం మండలం తంప, ధనుపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్ర హాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పాతపట్నం మండలం చంగుడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘాల నేతలు పాల్గొన్నారు.


పాతపట్నం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

రాజ్యాంగ స్ఫూర్తితో పాలన: రవికుమార్

ఆమదాలవలస, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ మార్గం అనుసరణీయమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నా రు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా.. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్: ఎన్ఈఆర్


రణస్థలం: జేఆర్‌పురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం/లావేరు/జి.సిగడాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వర రావు (ఎన్ఈఆర్) అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం జేఆర్ పురం, రణస్థలం, జి.సిగడాం, లావేరుల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాయల రమణ, ముప్పిడి సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ తోటయ్యదొర, కూటమి నాయకులు పాల్గొన్నారు.


అరసవల్లి: అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద జనసేన జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ తదితరులు


అరసవల్లి: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో..



అరసవల్లి: శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో..


ఎచ్చెర్ల: బీఆర్‌ఏయూలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ రజని తదితరులు

వలకు చిక్కిన 10 కిలోల అలుగు చేప

- అరుదని చెబుతున్న గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సీతాపురం ఎర్ర చెరువులో చేపలు పడుతున్న సమయంలో సుమారు 10 కిలోల బరువున్న అలుగు చేప వలకు చిక్కింది. ఈ ఏడాది వంశ ధార నీరు శివారు భూములకు విడుదల చేయడంతో చెరువులు నిండాయి. ఈ నేపథ్యంలో చెరువులో నీటికి చేపలు కూడా పెరిగాయి. ప్రస్తుతం నీరు అడుగంటడంతో సోమవారం గ్రామస్థులు వేటకు దిగారు. చేపల వేట చేస్తుండగా 10 కిలోల అలుగు చేప దొరికింది. సాధా రణంగా అలుగు చేప మూడు నుంచి ఐదు కిలోల బరువు ఉంటుందని, అయితే 10 కిలోల చేప పడడంతో గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


సీతాపురం చెరువులో చేపలు పడుతున్న గ్రామస్థులు (ఇన్‌సెట్‌లో) వలకు చిక్కిన 10 కిలోల అలుగు చేప

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించండి


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీలో జాబ్ కార్డులు కలిగిన వారికి ఉపాధి పని కల్పించాలని పలువురు సభ్యులు కోరారు. సోమవారం పంచాయతీ కార్యా లయ ఆవరణలో ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కాలవలు, రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందకు పంచాయతీ సిబ్బంది దృష్టి సారించాలని జామి వెంకట్రావు కోరారు. మారుతీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రెండు కేంద్రాల పిల్లలకు ఒకే గది ఉండడంతో ఇబ్బంది పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని రఘుపాత్రుని శ్రీధర్ కోరారు. 11ఆర్ కిళ్లాం కాలువలో మురుగునీరు నిలువ ఉండడంతో వీరన్నాయుడు కాలనీ వాసులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారని, సిల్ట్‌ను ఉపాధిలో తొలగించాలని నేతింటి సింహాచలం కోరారు. ఈవో ద్రాక్షాయిణి, సభ్యులు బీఎల్ శర్మ, వి.కేశవరాజు, పీస కృష్ణ, బలగ ప్రహర్ష పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించండి

పోలాకి/జలుమూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గ్రామసచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర ఐక్యవేదిక సంక్షేమ, విద్యా ఉద్యో గుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విధులపరంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. సమస్యల పరిష్కారానికి గాను సోషల్ వెల్ఫేర్ మంత్రి దృష్టికి తీసుకు వెళతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

పలాస ఎమ్మెల్యేకు వినతి

పలాస, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సంక్షేమ, విద్యా సహాయకులకు విద్యాశాఖలో పదోన్నతులు కల్పించాలని ఉత్తరాంధ్ర వెల్ఫేర్ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఈగల తిరుపతి, జిల్లా కమిటీ సభ్యుడు రమేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కార్యక్రమంలో సంఘ నేతలు నారాయణ, యువరాజ్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి చానల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

పాతపట్నం, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో వెల్ఫేర్ విద్యా సహాయకులకు పదో న్నతి చానల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర వెల్ఫేర్ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి వినతిపత్రం అందిం చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి మంత్రి దృష్టికి తీసుకు వెళతానన్నారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి


అమరవీరులకు నివాళి అర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలాసరూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి కె.సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక దినోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. పలాస మండల కాంప్లెక్స్‌లో ఉన్న కార్యాలయంలో కరపత్రాలను ఆయన విడుదల చేశారు. 1944లో ముంబై డాక్‌యార్డ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో చనిపోయిన వారికి నివాళిగా అగ్నిమాపక దినోత్సవాన్ని ఏప్రిల్ 14న జరుపుతున్నా మన్నారు. అమరులకు నివాళులర్పించారు కార్యక్రమంలో కౌన్సిలర్ టి.ఆనందరావు, అగ్నిమాపక అధికారులు డి.భాస్కరరావు, ప్రేమ్ కుమార్, మన్మథరావు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి బుచ్చోడు అన్నారు. సోమవారం కొత్తూరు అగ్నిమాపక కేంద్రంలో వారోత్సవాలను ప్రారంభించారు. ఇంట, బయట అగ్నిప్రమాదాలు సంభవిస్తే తమకు తాముగా ఎలా రక్షించు కోవాలో సిబ్బంది విన్యాసాలు చేసి వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యుడు పాలవలస శశిభూషణరావు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు లోతుగెడ్డ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చెరువుల అభివృద్ధికి సమగ్ర సర్వే

నందిగాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): చెరువుల శాశ్వత అభివృద్ధికి గాను సమగ్ర సర్వేకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు వంశధార ప్రాజె క్టు ఎస్ఈ ప్రగడ వెంకటతిరుపతిరావు ఆధ్వర్యంలో విశాఖకు చెందిన సర్వేయర్ మూర్తి సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు సోమవారం లచ్చన్నపేట సమీపంలోని మదన గోపాలసాగరం, నందిగాం సీతసాగరం చెరువులను పరిశీలించారు. వందల ఎకరాల విస్తీర్ణంతో ఉన్న చెరువులను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు గాను సాధ్యా సాధ్యాలను పరిశీ లిస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు. టెక్కలి వంశధార డివిజన్ ఈఈ శేఖర్‌బాబు నేతృత్వంలో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో నందిగాం నీటి సంఘం అధ్యక్షుడు కె.జయరాం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): టెక్కలి పాత జాతీయరహదారి మండాపొలం కాలనీ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక చేరివీధికి చెందిన భవన నిర్మా ణ కార్మికుడు జి.సింహాద్రి మండాపొలం కాలనీ నుంచి చేరివీధి వైపు సైకిల్ పై వెళ్తుండగా టెక్కలి నుంచి నందిగాం వైపు వెళ్తున్న వాహనం బలంగా ఢీకొట్టింది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

సంతబొమ్మాళి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పలాసకు చెందిన దివ్యాంగుడు బుట్ట గంగాధర్ కుటుంబానికి వీ ఫర్ నీడ్ సంస్థ రూ.25వేల సాయాన్ని సోమవారం అందించారు. ఈ ప్రమాదంలో భార్య కూడా తీవ్ర గాయాలబారిన పడడం, ముగ్గురు పిల్లలుండడంతో విషయం తెలుసుకున్న పల్లేవలస మనబడి అసోసియేషన్ సభ్యు లు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి వీ ఫర్ నీడ్ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లగా ఈ మొత్తం అందించారు.

ఘనంగా అయ్యప్ప స్వామికి పూజలు

కోటబొమ్మాళి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి జన్మదినం, స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ 30వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు తంగుడు కృష్ణస్వామి, దూపాన వెంకట రమణ స్వామి, ఆలయ అర్చకుడు సుసరాపు కృష్ణ స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషే కాలు చేపట్టారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్వామి తిరువీధి ఉత్సవం వైభ వంగా సాగింది. సాయంత్రం స్వామి పడిపూజ, విశేష హారతులిచ్చి శరణుఘోష చేశారు.

అయ్యప్ప స్వామి సేవలో ఎమ్మెల్యే..

పోలాకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పోలాకి ధర్మ శాస్తా దేవాలయంలో అయ్యప్పస్వామిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి జన్మదినం, ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డోల జగన్, ఎంవీనాయుడు, బైరి భాస్కర రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నౌపడలో..

సంతబొమ్మాళి,ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): నౌపడలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి బాల మురళీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో హోమం, పడిపూజ చేపట్టారు. మధ్యా హ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


దిమిలాడలో పూజలు చేస్తున్న భక్తులు

దిమిలాడలో..

నందిగాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దిమిలాడ, పెంటూరు, మొంద్రా యివలస, వేణు గోపాలపురం, నరేంద్రపురం తదితర గ్రామాల్లోని సన్నిధానాల్లో ప్రత్యేక పూజలు, అన్న ప్రసా ద వితరణ చేపట్టారు. దిమిలాడ ఆలయంలో బాల మురళి గురుస్వామి నేతృత్వంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో తిరువీధి నిర్వహించారు.

వైభవంగా సీతారామ కల్యాణం


సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

జలుమూరు (సారవకోట) ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అక్కివలస గ్రామంలోని శ్రీరామ మందిరంలో సోమవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి పురస్కరించుకొని అర్చకుడు రామానుజాచార్యులు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

ఘనంగా పాణా సంక్రమణం పూజలు

పలాసరూరల్,ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పలాస జై జగన్నాథ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథ ఆలయంలో పోణా (మేష) సంక్రమణం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశ్వ కల్యాణం కోసం ఏటా ఈ కార్యక్రమం చేపడుతున్న ట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఒడియా నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రత్యేకంగా పానకం తయారు చేసి భక్తులకు పంచి పెట్టారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబూరావు పండా, కైలాస్‌దాస్, నిత్యానంద పండా, బాలకృష్ణ, ప్రసాద్, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు అందని వడ్డీ రాయితీ

- మూడేళ్లుగా ఖాతాలకు జమకాని సొమ్ము
- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాత

కంచిలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిన గత వైసీపీ ప్రభుత్వం తమను కూడా నట్టేట ముంచిందంటూ నియోజకవర్గంలోని రైతులు తీవ్ర ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా సహకార బ్యాంకుల ద్వారా స్వల్ప కాలిక రుణాలు తీసుకునే రైతులకు అటు కేంద్రం 3 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4 శాతం వడ్డీ రాయితీని అందిస్తూ వచ్చేది. సాగు సమయంలో చేసిన అప్పులకు వడ్డీ లేకుండా రైతులు తమ కార్యకలాపాలను సాగిస్తూ వచ్చేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన వడ్డీ రాయితీని ఎగ్గొట్టడంతో వారంతా తీవ్ర ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా రైతుల ఖాతాలకు జమ కావాల్సిన వడ్డీ రాయితీ సొమ్ము జిల్లా పరిధిలో రూ.100 కోట్లకు పైబడి ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రతీ చిన్న, సన్నకారు రైతులకు జిల్లా సహకార బ్యాంకులు ఆరు నెలల నుంచి సంవత్సరం కాల పరిమితితో వడ్డీ రాయితీపై లక్ష రూపాయల వరకు రుణాలు అందజేస్తుంటాయి. సాగు సమయంలో తీసుకున్న రుణాలకు రైతులు 7 శాతం వడ్డీ చెల్లిస్తూ, రుణాలు తిరిగి సకాలంలో చెల్లించడం జరుగుతుంది. అయితే మూడేళ్లుగా రైతులు తాము తీసుకున్న రుణాలతోపాటు వడ్డీని చెల్లిస్తున్నారు. కానీ ప్రభుత్వం జమ చేయాల్సిన వడ్డీ రాయితీ మాత్రం రైతుల ఖాతాల్లో జమ కావడం లేదు. దీనిపై సంబంధిత రైతులు అటు జిల్లా సహకార బ్యాంకులకు, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీనిపై రైతులకు సరైన సమాచారం ఇచ్చేవారు సైతం లేకపోవడంతో వారంతా తమ గోడును ఎవరితో చెప్పుకోవాలో తెలియక నిట్టూరుస్తున్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ముంచేసిందంటూ వారు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి, రైతులకు బకాయి ఉన్న వడ్డీ రాయితీని అందించి ఆదుకోవాలని వారంతా కోరుతున్నారు.

రూ.కోట్లలో బకాయి

నియోజకవర్గంలోని కంచిలి మండలంలో 2023-24 సంవత్సరానికి 1800 మంది లబ్ధిదారులకు 12 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలకు సంబంధించి రైతులకు సుమారుగా మూడేళ్లకు గాను రూ.3 కోట్ల చెల్లించాల్సి ఉంది. అలాగే సోంపేట మండలంలో 1567 మంది రైతులకు గాను రూ.9 కోట్లు రుణాలు మంజూరు చేయగా వీరికి మూడేళ్లకు సుమారుగా 2 కోట్ల రూపాయలు చెల్లించాలి. ఇలా జిల్లా మొత్తంపై ఉన్న 44 సంఘాల్లో రైతులకు మూడేళ్ల కాలపరిమితికి రూ.100 కోట్లకు పైబడి చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటికే బ్యాంకులకు రైతులు ఈ మొత్తాన్ని చెల్లించినప్పటికీ, ప్రభుత్వం ఒక్క పైసా కూడా రైతుల ఖాతాలకు జమ చేయకపోవడంతో రైతులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు.

పొంతన లేని సమాధానాలు

మూడేళ్లుగా రైతులకు వడ్డీ రాయితీ అందని విషయాన్ని సంబంధిత జిల్లా సహకార బ్యాంకు అధికారులకు, ఇటు వ్యవసాయ శాఖాధికారులకు ప్రశ్నిస్తుంటే వారి నుంచి పొంతనలేని సమాధానాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం డబ్బులు వెయ్యకపోతే మేమేం చేస్తామంటూ బ్యాంకు అధికారులు చెబుతుంటే, వడ్డీ రాయితీపై మాకు ఎటువంటి సమాచారం లేదంటూ వ్యవసాయ శాఖాధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అంతిమంగా నష్టపోతున్నది మాత్రం మేమేనంటూ రైతులు మండిపడుతున్నారు.

గత పాలకుల తప్పిదమే..

రైతు ప్రభుత్వం అని చెప్పుకున్న గత వైసీపీ పాలకులు రైతులకు చెల్లించాల్సిన వడ్డీ రాయితీ సొమ్ము విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నామని చెబుతూనే వారికి చెల్లించాల్సిన బకాయిలకు ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడం వారికి రైతులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

కంటి తుడుపు చర్యలు..

జిల్లా వ్యాప్తంగా రైతులకు చెల్లించాల్సిన వడ్డీ రాయితీ రూ.వంద కోట్ల మేరా ఉండగా కేవలం రూ.9కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. అందులో కంచిలి మండలానికి సంబంధించి రూ.4.50లక్షలు మాత్రమే రైతుల ఖాతాల్లో జమచేశారు. పూర్తిస్థాయిలో చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

మూడేళ్లుగా ఎదురుచూస్తున్నాం..



మా తండ్రి కాలం నుంచి 15 ఏళ్లగా వ్యవసాయం చేస్తున్నాం. రుణాలు తీసుకుంటున్నాం. కానీ మూడేళ్లుగా వడ్డీ రాయితీ అందు కోలేకపోతున్నాం. దీనిపై ఏ అధికారిని అడిగిన సరైన సమాధానం చెప్పడం లేదు.

\- పోకల నీలకంఠం, రైతు, జింకిభద్ర

వెబ్‌సైట్‌లో హెచ్‌ఎంల పదోన్నతి జాబితా

గుజరాతీపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా సంచాలకుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించేందుకు జిల్లాలోని మున్సిపల్, జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్ తత్సమాన కేటగిరీలు, తాత్కాలిక సీనియార్టీ జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి వైబ్‌సైట్‌లో పందుపరిచినట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. సీనియార్టీ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఈ నెల 19వ తేదీలోగా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలలోగా పనిదినాల్లో తగిన ఆధారాలతో సరిచేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ యాజమాన్యంలో స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2 పదోన్నతి కోసం తాత్కాలిక సీనియార్టీ జాబితా ప్రాంతీయ సంచాలకులు, విద్యాశాఖ జోన్-1 విశాఖ వెబ్‌సైట్‌లో పొందపర్చడమైనదని, వాటిపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 19వ తేదీలోగా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, విద్యాశాఖ జోన్-1 విశాఖకు తగిన ఆధారాలతో సమర్పించాలని కోరారు.


మాజీ సైనికులకు అండగా ఉంటాం



శంకుస్థాపన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

అరసవల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు అన్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రాగోలు పంచాయతీ రాయపాడు గ్రామంలో రాష్ట్రప్రభుత్వం 50 శాతం, కేంద్ర ప్రభుత్వం 50 శాతం కలిపి మొత్తంగా రూ.2.92 కోట్లతో నూతనంగా నిర్మించనున్న 'సైనిక్ భవన్'కు సోమవారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, బ్రిగేడియర్ వెంకటరెడ్డి, పూర్ణచంద్రరావు, మురళీధరరావు, ఈశ్వరరావు, సత్యప్రసాద్, శైలజ, మాజీ సైనికులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



విజేతగా నిలిచిన దుదిష్టి మజ్జి

కవిటి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన రెండో సౌత్ ఈస్ట్ జోనల్ ఏపీ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2025 కాంపిటేషన్‌లో మెన్ పిజిక్ బీలో కవిటి మండలం తిప్పనపుట్టుగకు చెందిన దుదిష్టి మజ్జి విజేతగా నిలిచాడు. కాకినాడలో జరిగిన పోటీల్లో 165 కేటగిరిలో మొదటి స్థానాన్ని సంపాదించాడు. ఆదివారం వెలువరించిన ఫలితాల్లో విజేతలను ప్రకటించారన్నారు. టైటిల్‌తో పాటు మెడల్, మెరిట్ సర్టిఫికేట్ అందించారని దుదిష్టి మజ్జి తెలిపారు. ఈమేరకు గ్రామస్థులతో పాటు శ్రీకాకుళం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ముగిసిన రామాయణ హరికథగానం

ఆమదాలవలస, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కొత్తవలస కోదండ రామాలయం వద్ద 9 రోజుల పాటు శ్రీరామనవి ఉత్సవాలను గ్రామస్థులు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రతిరోజూ సంపూర్ణ రామాయణం హరికథాగానాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన హరికథా కళా ప్రపూర్ణ కుమారి షన్ముఖ భాగవతారిణి హరికథా గానం నిర్వహించారు. మంగళవారం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మేష సంక్రమణ పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కవిటి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల్లో సోమవారం మేషసంక్రమణ పూజలను ఘనంగా నిర్వహించారు. కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయంలో మహిళలచే కుంకుమ పూజలు చేపట్టారు. ఉషోదయ యువజన సంఘం, గ్రామస్థుల ఆధ్వర్యంలో చంద్రశేఖర శతపతి, ప్రశాంత్‌పాడి, నగేష్ పురోహితుల నేతృత్వంలో అమ్మవారికి అభిషేకాలు, పుష్పాభిషేకం చేపట్టారు. మహిళలచే గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి పూజాలు చేపట్టారు. జగతి, కుసుంపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లోని గ్రామదేవతలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కవిటిలోని భక్తులకు ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మజ్జిగ, కూల్‌డ్రింక్స్‌ను అందించారు.

పార్ట్‌టైమ్ పీఈటీల నూతన కార్యవర్గం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ వ్యాయామ ఉపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక గుజరాతీపేట ఏవీఎన్ఎం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు సమావేశమయ్యారు. జిల్లా యూనిట్ వెల్ఫేర్ టీమ్ అధ్యక్షుడుగా చిగిలిపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బుడుమూరు రమేష్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు మాట్లాడుతూ.. యూనియన్ బలోపేతంతోపాటు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషిచేస్తానన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా జిల్లా పీడీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి పాల్గొని ఎన్నికలను సజావుగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.ఢిల్లేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ జి.కామేష్, కోశాధికారి తారకేశ్వరరావు, సలహాదారుల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశాలకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అరసవల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఏర్పడి 20 సంవత్సరాలైన సందర్భంగా ఆశా వర్కర్లు సాధించిన విజయాలు - సవాళ్లు అనే అంశంపై స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశాలను రెగ్యులరైజ్ చెయ్యాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని, కార్మికులుగా గుర్తించాలని, ఒప్పంద జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు జీతాలు పెంచకపోవడం విచారకరమన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి కార్మికులంతా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. 44 లేబర్ కోడ్లను కేవలం నాలుగు కోడ్లుగా తీసుకురావడం, కార్మికుల మెడకు ఉరితాడు అని అన్నారు. ఈ కోడ్లను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా వచ్చే నెల 20న జరిగే సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి, ప్రధాన కార్యదర్శి అమరావతి, నాయకులు జయలక్ష్మి, లావణ్య, సుజాత, పార్వతి, సుధ, స్వర్ణలతా పట్నాయక్, అన్నపూర్ణ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనల అమలుతోనే సాధికారిత

ఎచ్చెర్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలు సాధికారిత సాధించాలంటే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆలోచనలు పక్కాగా అమలు చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. జాతీయ సామాజిక శాస్త్రాల పరిశోధన మండలి- దక్షిణ ప్రాంతీయ కేంద్రం (ఐసీఎస్ఎస్ఆర్- ఎస్ఆర్‌సీ) హైదరాబాద్ సహకారంతో వర్సిటీలో సోషల్‌వర్క్, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం సంయుక్తంగా 'విస్మరించిన వర్గాలకు సాధికారిత- సామాజిక పని విలువలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహకారం' అనే అంశంపై రెండు రోజులపాటు జాతీయ సెమినార్ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ.. 64 సబ్జెక్టుల్లో, 11 భాషల్లో అపారమైన విజ్ఞానం పొంది 50 వేల పుస్తకాలతో సొంత గ్రంథాలయాన్ని నడిపిన అంబేడ్కర్ తన దార్శనిక దృష్టితో ఎన్నో అంశాలపై రచనలు చేశారన్నారు. కొలంబియా యూనివర్సిటీ ప్రకటించిన 100 మంది ప్రపంచ మేధావుల్లో అంబేడ్కర్ మొదటి స్థానంలో నిలవడం ఎంతో గర్వకారణమన్నారు. ఐసీఎస్ఎస్ఆర్ -ఎస్ఆర్‌సీ గౌరవ సంచాలకులు డాక్టర్ సుధాకరరెడ్డి, ప్రొఫెసర్ పి.కేశవరెడ్డి (ఢిల్లీ యూనివర్సిటీ తత్త్వ విభాగం), సెమినార్ కన్వీనర్ డాక్టర్ యు.కావ్య జ్యోత్స్న అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ జి.పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన 'గ్లోబల్' విద్యార్థులు



సత్తాచాటిన బైపీసీ విద్యార్థినిని అభినందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

గుజరాతీపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో గ్లోబల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. గ్లోబల్ విద్యా సంస్థ నుంచి సంచలనాత్మక ఫలితాలు, మార్కులతో సత్తాచాటారు. జూనియర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 434 మార్కులతో జిల్లా ర్యాంకు సొంతం చేసుకున్నట్టు విద్యాసంస్థల చైర్మన్ ఎం.ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకుల సాధించాలన్నదే గ్లోబల్ సంస్థల లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి పట్ల అధ్యాపక బృందం శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూనియర్ బైపీసీలో లోపింటి ధరణి (434 మార్కులు)లతో టాపర్‌గా నిలువగ, కొర్ను మోహిని(427), కరణం తులసి (415), నూలు కిరణ్మయి (402) మంచి మార్కులు సాధించారని, ఎంపీసీలో కోటివాడ లాస్య ప్రియ (463 మార్కులు). పి.మాధురి (463), ఆర్.యశ్వంత్ (462), ఇసురు జనని, బి.యశ్వంత్ (459)తోపాటు 450 మార్కులు పైగా వచ్చిన వారులో 12 మంది ఉన్నారన్నారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎ.దామోదరరావు (981), ఎల్.స్నేహశ్రీ (980), కె.లోకేశ్వరరావు (979) ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులందరిని గ్లోబల్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ వై.సారిక రెడ్డి, తదితరులు అభినందించారు.

ఐక్యతతోనే బడుగులకు గుర్తింపు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు



అంతా ఏకమవ్వాలని నినదిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

అరసవల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో ఉంటేనే బడుగులకు గౌరవం, గుర్తింపు సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వెంగళరావు అన్నారు. నగరంలోని స్థానిక ఓ ప్రైవేట్ కాంప్లెక్స్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, మతాలకు, అతీతంగా బీసీలందరూ ఏకమైతేనే సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. అందరూ ఏకతాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా టెక్కలికి చెందిన గురునాథ్ యాదవ్, బీసీ సెల్ న్యాయవాదుల విభాగం అధ్యక్షుడిగా ఆగూరు ఉమామహేశ్వరరావు, సంఘం ఎచ్చెర్ల నియోజకవర్గం అధ్యక్షుడిగా ముద్దాడ రాజశేఖర్ యాదవ్ నియమితులయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కిల్లాన శ్రీనివాసరావు, కన్వీనర్ ఎ.నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు బేగ్, ప్రతినిధులు కృష్ణ, నర్తు నరేంద్ర, బుడుమూరు రాజేష్, గురునాథ్ యాదవ్, కిల్లాన మాధవరావు, పసగాడ రామకృష్ణ, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేలు వేతనం చెల్లించాలి



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

లావేరు, ఏప్రెల్ 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల మధ్యాహ్నం భోజనం కార్మికులకు రూ10 వేలు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ఏపీ పాఠశాల మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లావేరులో వంట కార్మికులు సమావేశమైయ్యారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 88 వేల మంది కార్మికులు గత 25 ఏళ్లుగా పని చేస్తున్నారని చెప్పారు. వీరంతా చాలీచాలని వేతనాలతో తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు.

22-ఏ జాబితా నుంచి తొలగించండి



మాట్లాడుతున్న ఈవో శాంతకుమారి

సోంపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సోంపేట పట్టణ పరిధిలోని తమ ఇళ్ల స్థలాలు 22ఏ జాబితాలో నమోదు చేయబడ్డాయని వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన పలువురు ప్రజలు అధికారులను కోరారు. స్థానిక మహదేవిపేట వీధిలో పంచాయతీ ఈవో ఎం.శాంతకుమారి ఆధ్వర్యంలో గ్రామసభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహదేవిపేట, సూర్యావనవీధి, జలంత్ర జాలారివీధితో పాటు పంచాయతీ పరిధిలో ఉన్న తమ ఇళ్ల స్థలాలు 22ఏ జాబితాలో చేర్చడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అలాగే పంచాయతీలో అపరిష్కృతంగా ఉన్న కాలువల నిర్మాణం, రోడ్లు, తాగునీటి కుళాయిలు తదితర సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. సమావేశానికి సచివాలయ సిబ్బంది తప్ప ఇతర శాఖల అధికారులు పాల్గొనకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, బీన ఆనంద్, కొంచాడ నెహ్రూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేతాలమ్మకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వాంగ్రంగిలో వెలసియున్న నేతాలమ్మకు యాత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పసుపు, కుంకుమ, ముర్రాటలను చెల్లించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సారాను నిర్మూలిద్దాం

సోంపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): సారాను పూర్తిగా నిర్మూలిద్దాం అని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ బేబీ అన్నారు. నవోదయం-2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం సోంపేట, కంచిలి మండలాల్లో సారా ప్రభావిత గ్రామాల్లో సారాపై గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. సారా అక్రమ రవాణా చేసిన అమ్మకాలు జరిపినా క్రిమినల్ కేసులునమోదు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎక్సైజ్ సీసీ పి.దుర్గాప్రసాద్, పలాస ఎస్‌హెచ్‌వో మల్లికార్జునరావు, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైనా ఉద్యోగావకాశాలు

అరసవల్లి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ/డిప్లమా పారామెడికల్/నర్సింగ్/బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులను అందిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు సెల్ నెంబర్లు 7680945357, 7995013422 ఫోన్ నెంబర్లను సంప్రదించి, తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. శ్రీకాకుళం సమీపాన గల రాగోలులో గల జెమ్స్ క్యాంపస్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సీతారామ కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బలగలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో సీతారామ కల్యాణం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలు, స్వామి వారికి అలంకరణ, విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



అగ్నిమాపక పరికరాలకు పూజ చేస్తున్న దృశ్యం

గుజరాతీపేట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతబస్టాండ్‌లో గల అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక దినోత్సవ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రిటైర్డు ఫైర్ ఆఫీసర్ కేపీ నారాయణ పాల్గొని అగ్నిమాపకంలో వాడే దుస్తులు, వస్తువులకు పూజ చేసి ప్రారంభించారు. అదేవిధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా టీడీపీ సభ్యత్వ నమోదు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో ఇంటింటా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెండ రాజారావు, క్లస్టర్ ఇన్‌చార్జి మూకళ్ల భాస్కరరావు, బూత్ ఇన్‌చార్జీలు ఉంగటి మల్లేశ్వరరావు, నిడిగింట్ల రమణ, నేతింటి రాజారావు, జరుగుళ్ల రామ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని మాపక సిబ్బంది ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడడానికి చేస్తున్న చేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రాణాలు లెక్క చేయకుండా అగ్ని మాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అగ్ని ప్రమాలు జరిగినప్పుడు ఏవిధంగా బయటపడాలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు, పాఠశాలల్లో విద్యార్థులకు, బహుల అంతస్తుల్లో నివాసం ఉన్నవారికి అవగాహన కల్పిస్తామని జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావు, రణస్థలం అగ్నిమాపక అధికారి అశోక్ అన్నారు. కార్యక్రమంలో జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

అందరివాడు అంబేడ్కర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షుడు డా.బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, బడుగు వర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి అన్నారు. పర్లాకిమిడిలో ఉపాధ్యాయ, ఉద్యోగ, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాం డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అనూప్‌పండా, మున్సిపల్ చైర్మన్ నిర్మలశెట్టి, అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా

ఒడియా నూతన సంవత్సర వేడుకలు

పర్లాకిమిడి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లాలో పొణా సంక్రమణం సందర్భంగా ఒడియా నూతన సంవత్సర వేడుకలు సోమవారం నిర్వహించారు. పర్లాకిమిడి ప్రధాన కూడళ్లలో పానకాల ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

హనుమత్‌జయంతి వేడుకలు



పర్లాకిమిడిలో బైక్‌ర్యాలీ

పర్లాకిమిడి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి పట్టణంలో సోమవారం హనుమత్ జయంతి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయ ఆలయాలను సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేపట్టారు. రామభక్తుల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫీమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.


మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్టు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్‌ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్‌ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫోటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

చేపల వేటకు విరామం

● నేటి నుంచి అమలు ● ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



డి.మత్స్యలేశం తీరంలో పడవను ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు (ఫైల్)

ఎచ్చెర్ల/ రణస్థలం/ వజ్రపుకొత్తూరు/ పోలాకి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో రెండు నెలల పాటు చేపల వేటకు విరామం ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్‌టీ నెంబర్-129ను విడుదల చేసింది. సంప్రదాయ తెప్పలతో చేపలు వేటాడుకోవచ్చు. మోటారు, మెకనైజ్డ్ బోట్లకు అనుమతి లేదు. చేపలు గుడ్లు పెట్టే దశలో మోటారు, మెకనైజ్డ్ బోట్లతో వేటాడితే మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీంతో ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు 61 రోజుల పాటు వేట నిషేధం అమలులో ఉంటుంది.

పెరిగిన మోటారు బోట్లు..

జిల్లాలో 193 కిలోమీటర్ల పొడవున సుదూర సముద్ర తీరం ఉంది. జిల్లాలోని 11 మండలాల్లో 104 సముద్ర తీర గ్రామాలు ఉన్నాయి. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో మొత్తం 6,211 మంది మత్స్యకారులు వేటకు వెళ్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా మొత్తమ్మీద సుమారు 1000 వరకు మోటార్ బోట్లు ఉన్నాయి. నిషేధ సమయంలో చాలా వరకు మత్స్యకారులకు పని ఉండదు. కొన్నాళ్ల క్రితం వరకు ఈ ప్రాంత మత్స్యకారులు సంప్రదాయ తెప్పలతోనే చేపలు వేటాడేవారు. ప్రభుత్వం రాయితీపై మోటారు బోట్లను సరఫరా చేయడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. దాదాపుగా ప్రతి తీర గ్రామంలో పది నుంచి 15 వరకు మోటారుతో పని చేసే బోట్లు ఉన్నాయి. ఒక్కోబోటుపై 8 నుంచి 10 మంది వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళుతుంటారు. తెప్పలతో 8 కిలోమీటర్ల పరిధిలోనే చేపల వేట సాగించవచ్చు. మోటారైజ్డ్ బోట్లతో అయితే 50 కిలోమీటర్ల వరకు ప్రయాణించి చేపల వేట సాగిస్తారు.

అందని మత్స్యకార భరోసా

చేపల వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. గతంలో రూ.2 వేలు ఉన్న ఈ సాయాన్ని 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వం రూ.4 వేలకు పెంచింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచింది. దీన్ని రూ.20 వేలకు పెంచుతున్నట్టు ఇప్పటి ప్రభుత్వం ప్రకటించింది. గతేడాదికి సంబంధించి భరోసా ఇప్పటి వరకు అందలేదు. గత ఏడాది 15,375 మందికి భరోసా అందజేయాలని మత్స్యశాఖ అధికారులు నిర్ణయించారు. కానీ అందలేదు.

భృతి పక్కదారి..

వైసీపీ ప్రభుత్వంలో వేట నిషేధ భృతి అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సోంపేట, వజ్రపుకొత్తూరు మండలాల్లో పథకం పక్కదారి పట్టింది. రాజకీయ ఒత్తిళ్లతో చాలా మంది అనర్హులు దక్కించుకున్నారు. నాయకులు బినామీల పేరుతో లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డారు. దీనిపై ఫిర్యాదులు వచ్చినా ఎటువంటి దర్యాప్తులు లేవు. సరిగ్గా వేట సాగక ఏటా వేలాది మంది మత్స్యకారులు కుటుంబాలను గ్రామాల్లో విడిచిపెట్టి సుదూర ప్రాంతాలకు వలసపోతున్నారు. స్థానికంగా ప్రత్యామ్నాయ ఉపాధి లేక కొంతమంది రహదారుల పక్కన కళ్లద్దాలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. జిల్లాలో హైవేతో పాటు ప్రధాన రహదారుల వెంబడి కనిపించే దుకాణాలు ఎక్కువ శాతం మత్స్యకారులవే. కనీసం మత్స్యకార గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కూడా జరగని దుస్థితి. వేట నిషేధ సమయంలోనైనా పక్క గ్రామాలు, మైదాన ప్రాంతాల్లోనైనా ఉపాధి పనులు కల్పించాలని మత్స్యకారులు ఎప్పటి నుంచో కోరుతున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వేటకు వెళితేనే పూట గడిచేది



వేటకు వెళితేనే పూట గడిచేది. లేకుంటే పస్తులే మిగులుతాయి. తుఫాన్లు, వాతావరణం సరిగ్గా లేనప్పుడు రోజుల తరబడి ఇంటి వద్దే ఉండిపోతాం. కనీసం ఉపాధి హామీ పనులు ఉంటే కొంత ఇబ్బందులు తీరుతాయి. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఉపాధి పనులు మాత్రం కల్పించలేదు.

-ఎం.సోమయ్య, అల్లివలస, రణస్థలం మండలం

చాలా ఇబ్బందులు పడుతున్నాం



స్థానికంగా వేట గిట్టుబాటు కావడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. తప్పనిసరైతే సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. ఉన్న గ్రామాల్లో కుటుంబాలను విడిచిపెట్టి అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాలో హార్బర్లు, జెట్టీల నిర్మాణం పూర్తిచేయాలి.

-మూగపల్లి అప్పలన్న, అల్లివలస, రణస్థలం మండలం

అర్హులకు భరోసా అందజేయాలి..



చేపల వేటే జీవనాధారం గల మత్స్యకారులకు నిషేధ సమయంలో భరోసా అందజేయాలి. గత ఏడాది భరోసా మొత్తం ఇప్పటి వరకు అందలేదు. మళ్లీ వేట నిషేధానికి సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిషేధ సమయంలో రెండు నెలల పాటు ఎలాంటి పని లేకుండానే మత్స్యకారులు జీవనం సాగించాల్సి ఉంటుంది.

-రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం, ఎచ్చెర్ల మండలం

తీర గ్రామాల్లో అవగాహన..



సముద్రంలో మోటారు, మెకనైజ్డ్ బోట్లతో ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు చేపల వేట నిషేధానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వులను అమలు చేసేందుకు తీర గ్రామాల్లో మత్స్యకారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అలాగే దండోరా కూడా వేయిస్తాం. ఈ ఏడాది ఎన్యూమరేషన్‌కు సంబంధించి ఇంకా ఉత్తర్వులు అందాల్సి ఉంది.

-వై.సత్యనారాయణ, ఉప సంచాలకులు, మత్స్యశాఖ

బహుజనులు స్వేచ్ఛగా బతకాలి

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఈ దేశపు విలువైన ఆస్తి. ఆయన ఆశయ సాధనలో ముందుకు పయనిద్దామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పీఎంజే బాబు, మట్టా పురుషోత్తం, గోర సురేష్, కంఠ వేణు, బోసు మన్మథరావు, త్రైక్వాండో శ్రీను, బొడ్డేపల్లి నర్సింహులు, సుధాకర్, మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

ఆఫ్‌జోర్

(ఐదో పేజీ తరువాయి)

సాగునీరు అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు వంశధార ఎస్‌ఈ తిరుపతిరావు ఇటీవల ఈ విషయాన్ని స్పష్టం చేయడం.. అందుకు తగిన విధంగానే పనులు సాగుతుండడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు నిధులు మొత్తం విడుదల చేస్తే రెండేళ్లలో ఆఫ్‌షోర్ జలాశయం పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్గత కాలువలు, మహేంద్రతనయ నది నుంచి ప్రధాన కాలువల నిర్మాణంపై అధికారులు దృష్టి సారిస్తే ప్రజల చిరకాలవాంఛ నెరవేరనుంది.

పూర్తి స్థాయిలో నీరందిస్తాం..

రెండేళ్లలో ఆఫ్‌షోర్ పూర్తవుతుంది. నా తండ్రి గతంలో గెడ్డం దీక్ష చేసి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి ఆఫ్‌షోర్ తీవ్రత తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార నీరు సకాలంలో రైతులకు ఇచ్చాం. మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, పూర్తిస్థాయిలో ఆఫ్‌షోర్‌పై దృష్టి పెట్టారు. బడ్జెట్‌లో ప్రాధాన్యతలో లేకపోయినా రూ.120కోట్లు మంజూరు చేయడం జిల్లాప్రజల అదృష్టంగా భావిస్తున్నాం. ఆఫ్‌షోర్ ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు, పలాస-కాశీబుగ్గ ప్రజలకు తాగునీరు అందిస్తాం.

-గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

సాంకేతికతతో సమగ్ర అభివృద్ధి

● కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

● చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి ● జిల్లాలో వినూత్న ప్రయోగానికి శ్రీకారం

అరసవల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించవచ్చని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే వినూత్న ప్లాంట్‌కు తండేలవలసలో సోమవారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రక్రియ పర్యావరణ పరిరక్షణతో పాటు, విద్యుదుత్పత్తికి దోహదపడుతుందని అన్నారు. ఈ విధానాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సుమారు రూ.20కోట్లతో ఎస్కవరీ వేస్ట్ సొల్యూషన్స్ అనే సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. కార్పొరేషన్ ప్రతి రోజూ చెత్తను అందజేస్తుంది. దీనిని ప్రాసెస్ చేయడం ద్వారా ఆయిల్, గ్యాస్, నీటిని ఆ సంస్థ ఉత్పత్తి చేస్తుంది. ఈ ఆయిల్‌ను జనరేటర్లలో వినియోగించి... విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. నిత్యం సుమారు 50 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసి... విద్యుత్తు, నీరు, ఎల్పీజీ వంటి ఉప ఉత్పత్తులుగా మారుస్తారు. ఒక మెట్రిక్ టన్ను చెత్త నుంచి ఒక మెగావాట్ విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చునని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సంస్థ ప్రతినిధులు రితేష్ మున్షీ, మంత్రిత్ సింగ్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

అంతన్నారు.. ఇంతన్నారు!

(ఐదో పేజీ తరువాయి)

నిధులు మంజూరు చేశారు. ఇందులో 186 పనులు మాత్రమే పూర్తిచేశారు. ఇంకా 477 భవనాలు పలు స్థాయిల్లో ఉన్నాయి. దీనికి రూ.42.18 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు.

● 194 మిల్క్‌సెంటర్లకుగాను 22 పనులు మాత్రమే ప్రారంభించారు. ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో భవనానికి రూ.16లక్షలు చొప్పున రూ.22.83 కోట్లు మంజూరు చేశారు.

● 195 డిజిటల్ లైబ్రరీలకు గాను 26 పనులు మాత్రమే ప్రారంభించారు. రూ.31.20 కోట్ల అంచనా లతో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థలో మార్పులు చేపట్టేందుకు కమిటీలు ఏర్పాటు చేసింది. సిబ్బందిని వేరే శాఖలకు సర్దుబాటు చేయాలనే ఆలోచనలో ఉంది. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కూడా సచివాలయాలకు నిధులు కేటాయించలేదు. దీంతో భవనాల పనుల పూర్తిపై సందేహాలు నెలకొన్నాయి.